క్లుప్తంగా

వైభవంగా కొండాలమ్మ జాతర



ముమ్మిడివరం పురవీధుల్లో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం: ముమ్మిడివరం కొండాలమ్మ చింత వద్ద గల కొండాలమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించారు. ఉగాది పర్వదినం నుంచి ఈ జాతర ప్రారంభమైంది. మంగళవారం అమ్మవారి గరగ పూజ, జాతర, తీర్థం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురవీధులలో శక్తివేషాలు, బాజా భజంత్రీలతో బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ పెట్టా శివప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతరలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



కోరింగా ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న పూర్ణప్రసాద్

తాళ్లరేవు: కోరింగా ఫార్మసీ కళాశాలలో మంగళవారం దివీస్ లాబొరేటరీస్ సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. కళాశాల సెమినార్ హాలులో నిర్వహించిన ఈ ఇంటర్వ్యూల్లో సుమారు 100 మంది విద్యార్థులకు సంస్థ హెచ్ఆర్ పూర్ణప్రసాద్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు మెయిల్ ద్వారా అంగీకార పత్రాలు పంపనున్నట్లు పూర్ణప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, ప్రిన్సిపాల్ సువర్ణజ్యోతి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.డి రవిప్రకాష్, ఏఓ కె.మాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది పురస్కార గ్రహీతకు సత్కారం



డాక్టర్ కొల్లూరిని సత్కరిస్తున్న సుబ్బాలమ్మ దేవస్థానం చైర్మన్, అభివృద్ధి కమిటీ సభ్యులు

అమలాపురం టౌన్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకున్న పట్టణానికి చెందిన కవి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరిని స్థానిక పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానం వద్ద మంగళవారం అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. సుబ్బాలమ్మ దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యుడైన డాక్టర్ కొల్లూరికి అమ్మ వారి అన్నసమారాధన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయనను దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి సాయి పుల్లయ్య నాయుడు, కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు నిమ్మకాయల నాని, యర్రంశెట్టి మూర్తి, అరిగెల చంద్రశేఖర్, ముత్యాల గంగాధర్, అరిగెల బాబ్జి తదితరులు డాక్టర్ కొల్లూరి సత్కరించారు.

మురుగులమ్మ జాతరకు శ్రీకారం

అమలాపురం రూరల్: అమలాపురం మండలం బండారులంకలో గంగాదేవి మురుగులమ్మ తీర్థం సందర్భంగా మంగళవారం అమ్మవారిని ప్రతిష్ఠించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈనెల 28వ తేదీ సోమవారం రాత్రి జాతర, 29న మంగళవారం తీర్థం నిర్వహించనున్నట్టు ఆలయ శాంతి కమిటీ సభ్యులు తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు జాన్ గణేష్, స్వాతి దంపతులు అమ్మవారికి చీర, గాజులు, పసుపు కుంకాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

దాడి కేసులో రౌడీ షీటర్ అరెస్ట్

అమలాపురం టౌన్: ఓ బాకీ విషయమై ఎర్ర వంతెన సమీపంలో ఓం ప్రకాష్, మహిళపై దాడి చేసి గాయపరిచిన పట్టణానికి చెందిన రౌడీ షీటర్ కంచిపల్లి శ్రీనును మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఆ ఇద్దరిపై రౌడీ షీటర్ దాడి చేసి గాయపరిచాడని సీఐ చెప్పారు.

కట్నం వేధింపులపై ఫిర్యాదు

పట్టణంలోని మెబర్లీపేటకు చెందిన గునిశెట్టి సత్యవతి (27) తన భర్త నాగబాబు అదనపు వరకట్నం కోసం శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పెడుతున్నాడని బాధితురాలు పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్‌బాబు తెలిపారు. సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త నాగబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కన్నుల పండువగా వెంకన్న రథోత్సవం

- తిలకించి, తరించిన వేలాది మంది భక్తులు
- ముందు జాగ్రత్తగా విద్యుత్ సరఫరా నిలిపివేత
- వీధుల్లో వైభవంగా సాగిన రథోత్సవం

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి వారి రథోత్సవం పుర వీధుల్లో అశేష భక్త జనావళి నడుమ వైభవంగా సాగింది. దేవస్థానానికి ఎదురుగా గల 216 జాతీయ రహదారికి ఇరువైపులా ఉదయం నుంచి రాత్రి వరకూ నిర్వహించిన తీర్థానికి కోనసీమ నలుమూలల నుంచి వేలాది మంది భక్తుల హాజరయ్యారు. తొలుత స్వామిని దర్శించుకుని అనంతరం తీర్థం వేడుకల్లో పాల్గొన్నారు. దేవస్థానం ప్రాంగణం నుంచి సాయంత్రం 3.15 గంటలకు మొదలైన 50 అడుగుల ఎత్తు ఉన్న రథానికి ఎంపీ గంటి హరీష్ మాథూర్ కొబ్బరి కాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథం మహిపాల వీధి, గాంధీ బజార్, యర్రమిల్లి వారి వీధి, గండు వీధి, గారపాటి వీధి మీదుగా వెళ్లి దేవస్థానానికి చేరుకుంది. భక్తులు రథంపై అరిట పండ్లను వేసి గోవింద నామ స్మరణలో తన్మయత్వం చెందారు. రథోత్సవం సాగిన వీధుల్లోని రోడ్లపై విద్యుత్ సరఫరాను అధికారులు ముందు జాగ్రత్త చర్యగా నిలిపివేశారు.

రథానికి ప్రత్యేక అలంకరణ

తొలుత రథశాల వద్ద రథాన్ని పువ్వులు, ఫలాలు, మామిడి తోరణాలతో అలంకరించారు. అక్కడే రథ హోమాన్ని దేవస్థానం అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి కల్యాణ కర్తలు యిండిగెల శ్రీనివాసరావు, వీరభద్రరావు, శివరామ సూర్యవరప్రసాద్ దంపతులతో రథం హోమం నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తమ ఇళ్ల నుంచి, డాబాల అంతస్తుల నుంచి, ఎత్తైన భవనాలపై నుంచి తిలకించి తరలించారు. తాళ్లతో రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథోత్సవంలో ఎంపీతో పాటు అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, స్థానిక వార్డు కౌన్సిలర్ గండి దేవి హారిక, మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను, బీజేపీ జాతీయ కిసాన్ మెర్చా నాయకుడు నల్లా పవన్‌కుమార్, ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు పాల్గొని ఆద్యంతం రథం ముందు సాగిన ఊరేగింపులో పాల్గొన్నారు. రథోత్సవం వెంబడి గారిడీ నృత్యాలు, కేరళ డప్పుల వాయిద్యాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



అమలాపురంలో భక్తుల నడుమ సాగుతున్న వేంకటేశ్వరస్వామి రథోత్సవం



మున్సిపాలిటీ ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

భక్తుల దాహార్తిని తీర్చిన దాతలు

అమలాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన స్వామి తీర్థం, రథోత్సవానికి తరలి వచ్చిన వేలాది మంది భక్తులకు పలువురు దాతలు, సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తుల దాహార్తిని తీర్చారు. ముఖ్యంగా స్థానిక మున్సిపాలిటీ రూ.లక్ష వ్యయంతో రథోత్సవం రోజున రోడ్డు చెంతన బెల్లం పానకం, మజ్జిగను భక్తులకు అందించే సంప్రదాయం కొన్నేళ్లుగా సాగుతోంది. ఇందులో భాగంగా మున్సిపాలిటీ ఏర్పాటుచేసిన పానకం, మజ్జిగ చలివేంద్రాన్ని చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కౌన్సిలర్లు ప్రారంభించారు. చైర్‌పర్సన్‌తోపాటు కౌన్సిలర్లు గండి హారిక, గొలకోటి విజయలక్ష్మి, బొర్రా వెంకటేశ్వరరావు భక్తులకు పానకం, మజ్జిగ పోశారు. స్థానిక శ్రీవాగ్దేవి స్కూలు యాజమాన్యం భక్తులకు స్థానిక మహిపా వీధి రామాలయం వద్ద కూల్ డ్రింక్స్, మజ్జిగను అందించింది. మహిపాల వీధి వినాయక గుడి వద్ద చిక్కం కుటుంబీకులు భక్తులకు కూల్ డ్రింక్స్ సమకూర్చారు. ఈ కూల్ డ్రింక్స్ పంపిణీని మున్సిపల్ వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్ ప్రారంభించారు. గాంధీ సెంటరులో మహిపాల వీధి, గాంధీనగర్ యువత ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. స్వామి కల్యాణోత్సవాల్లో రెండో రోజు మంగళవారం మధ్యాహ్నం దేవస్థానం మాజీ చైర్మన్ దివంగత కర్రి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన మనవడు కర్రి బాబు దేవస్థానానికి ఎదురుగా ఉన్న సత్యనారాయణ గార్డెన్స్‌లో అన్న సమారాధన నిర్వహించారు.

నేత్రపర్వం... మీసాల వెంకన్న కల్యాణం



పి.మల్లవరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చక బృందం



ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

- కల్యాణోత్సవానికి పోటెత్తిన భక్తులు
- పి.మల్లవరంలో ఆధ్యాత్మిక సందడి

తాళ్లరేవు: పవిత్ర చైత్రమాసం శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం నేత్రపర్వంగా నిర్వహించారు. పి.మల్లవరం శ్రీ వేంకటేశ్వర స్వామి (మీసాల చినవెంకన్న) కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కేవీ వేణుగోపాల్ పర్యవేక్షణలో స్వామివారి కల్యాణాన్ని అర్చకులు ఖండవిల్లి సీతారంగాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు తదితరుల బృందం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆరుబయట కల్యాణ మండపంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దని ఆందోళన

తాళ్లరేవు: స్మార్ట్ మీటర్లు తమ ఇళ్లకు బిగించవ వద్దని, పాత మీటర్లను కొనసాగించాలని పి.మల్లవరంలో రైతులు ఆందోళన చేసారు. మంగళవారం పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో ఏపీ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టి పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల కారణంగా పేదలపై కోట్ల రూపాయల భారం పడుతుందన్నారు. గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను బహిష్కరించండని పిలుపునిచ్చిన చంద్రబాబు, లోకేష్ ఇప్పుడెలా వేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేసారు. అనంతరం విద్యుత్ మీటర్ల ప్రతులను మంటల్లో వేసి దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అనుసూరి సత్యనారాయణ, కుడుపూడి రామకృష్ణ, పేరాబత్తుల మీరయ్యకాపు, మేడిశెట్టి భాస్కరరావు, ఏడుకొండలు, పిల్లి భైరవమూర్తి, సూరంపూడి శ్రీను, చవ్వాకుల జాన్‌ప్రసాద్ పాల్గొన్నారు.



పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో ఆందోళన చేస్తున్న రైతులు

అలరించిన సంగీత విభావరి

అమలాపురం టౌన్: స్థానిక భూపయ్య అగ్రహారంలో కొలువై ఉన్న శ్రీరామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి మహోత్సవాల్లో భాగంగా ఆర్ట్ ఫ్యామిలీ సంస్థ మంగళవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించింది. దేవస్థానం ప్రాంగణంలో అమర గాయకుడు ఘంటసాల ఫేమ్ గాయకులు నిర్వహించిన సంగీత విభావరి అందరినీ అలరించింది. విశాఖపట్టణానికి చెందిన గాయకులు నూకల ప్రభాకర్, నూకల రామనరసింహం, భూపయ్య అగ్రహారానికి చెందిన పేరి సత్యవాణి అలనాటి ఘంటసాల ఆలపించిన మధుర గీతాలను పాడి రంజింపజేశారు. ఆ గాయనీ గాయకులను దేవస్థానం ఈవో, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మాచిరాజు లక్ష్మీ నారాయణ, ఆర్ట్ ఫ్యామిలీ ప్రతినిధులు తాతపూడి సౌమ్య లక్ష్మి, కొత్తూరి బాల, ఆంధ్ర ఉషారాణి తదితరులు పండిత శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీసీపీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీను, సంస్కార భారతి జిల్లా ప్రధాన కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, విశ్రాంత బ్యాంక్ అధికారి పేరి లక్ష్మీ నరసింహం పాల్గొన్నారు.



గాయకులను సత్కరిస్తున్న అధికారి లక్ష్మీనారాయణ, ఆర్ట్ ఫ్యామిలీ ప్రతినిధులు

దళితులను విడదీసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర

మాల సంఘాల ఐక్య వేదిక జిల్లా చైర్మన్ డీబీ లోక్

అమలాపురం టౌన్: ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులను విడదీసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని మాల సంఘాల ఐక్య వేదిక జిల్లా చైర్మన్ డీబీ లోక్ అన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణ కోసం వేసిన ఏక సభ్య కమిషన్‌ను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక మద్దాలవారి పేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించిన మాల సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో డీబీ లోక్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని మాలలంతా ఐక్యంగా పోరాటాల ద్వారా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాజకీయ లబ్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు మాలలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో మాలలు ఐక్యంగా చంద్రబాబుకు బుద్ధి చెబుతారని లోక్ స్పష్టం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా, చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. సమావేశంలో మాలల సంఘాల నాయకులతో పాటు పలు ప్రజా సంఘాల ప్రతినిధులు జంగా బాబూరావు, ఇసుకపట్ల రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మాల సంఘాల ఐక్య వేదిక జిల్లా నాయకులు

సీసీ కెమెరాలతో నేర పరిశోధన వేగవంతం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు పోలీసులకు సహకరిస్తూ వారికి పట్టణ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసేందుకు రూ.2 లక్షల విలువైన సీసీ కెమెరాలను సమకూర్చారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ చేతుల మీదుగా డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబుకు మంగళవారం వాటిని అందజేశారు. ఈ సీసీ కెమెరాలను గడియారం స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు, కలశం సెంటరులో ఏర్పాటు చేయనున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు. పట్టణమంతా సీసీ కెమెరాల వ్యవస్థ ఉంటే నేర పరిశోధనకే కాకుండా నిందితులను సునాయాసంగా గుర్తించే వీలుంటుందని సీఐ పేర్కొన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు యెండూరి నాగేశ్వరరావు, కుప్పాల రామకృష్ణ, ఆకే సూరిబాబు, సప్పా నాగేశ్వరరావు, తోట బాబ్జి, అప్పలరాజు, అడపా బాబ్జి, తిరుమనాథం బుజ్జి పాల్గొన్నారు.



చాంబర్ ఆఫ్ కామర్స్ సమకూర్చిన సీసీ కెమెరాలతో డీఎస్పీ ప్రసాద్, సీఐ వీరబాబు, వ్యాపారులు

ఆక్వాతో వ్యవసాయానికి నష్టం

తాళ్లరేవు: రోజురోజుకూ విస్తరిస్తున్న ఆక్వా సాగు కారణంగా వ్యవసాయానికి, ఎంతోకాలంగా ఉన్న డ్రెయిన్లకు నష్టం కలుగుతోందని, రైతుల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేసారు. మంగళవారం ఎఫ్‌డీఓ ఎన్.గోపి ఆధ్వర్యంలో పటవల, కోరంగి పంచాయతీలో ఆక్వా గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సలహాలు, సూచనలతోపాటు వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. చెరువుల కారణంగా పలుచోట్ల వ్యవసాయ భూములకు సాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదని, పంట కాలువల్లోకి ఉప్పునీరు ప్రవేశించి వరి పంటకు నష్టం కలుగుతుందని వాపోయారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ గోపి మాట్లాడుతూ ఆక్వా వల్ల కలుగుతున్న ఇబ్బందుల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పటవల పంచాయతీలో 540 ఎకరాలు నాన్ ఆక్వాజోన్లు ఉండగా, 421 ఎకరాలను ఆక్వా జోన్‌లో చేర్చాలని రైతులు కోరారన్నారు. కోరంగి పంచాయతీలో 452 ఎకరాలు నాన్ ఆక్వా జోన్‌లో ఉండగా 99.68 ఎకరాలు ఆక్వా జోన్‌లో చేర్చుటకు గ్రామసభల్లో తీర్మానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పటవల, కోరంగి సర్పంచ్‌లు పినపోతు చినకామేశ్వరరావు, పెయ్యల మంగేష్, పంచాయతీ కార్యదర్శులు అర్థాని రామరాజు, వీజేవీ రమణ, రైతులు, మత్స్యశాఖ సహాయకులు పాల్గొన్నారు.



పటవల ఆక్వా జోన్ గ్రామసభలో మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ గోపి

సీబీఎస్ఈ సిలబస్‌కు మారేందుకు సుముఖత

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ప్రస్తుతం కొనసాగుతున్న స్టేట్ కరిక్యులమ్ నుంచి సీబీఎస్ఈ సిలబస్‌కు మారేందుకు సముఖత వ్యక్తం చేస్తున్నాయని మంగళవారం విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగు రీజియన్లలో 80 శాతం మంది విద్యార్థులు సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యను పూర్తి చేసి ప్లస్-1లో చేరేందుకు అడ్మిషన్లు పొందారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ అమలు చేయడం శుభపరిణామమన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఎంబీబీఎస్ వంటి మెడికల్ కోర్సుల్లో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి తెలిపారు.

అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్థానిక సెంట్రల్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న నేపథ్యంలో దాని స్థానంలో అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు భోజనాన్ని అందించేందుకు మంగళవారం నుంచి పైలెట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. దీనికి సంబంధించి గిరియాంపేట, సావిత్రినగర్, శారద ఎయిడెడ్ ప్రభుత్వ హైస్కూళ్లను ఎంపిక చేశారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే పుదుచ్చేరిలో, కాకినాడ మున్సిపాలిటీ స్కూళ్లలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 2022 నుంచి పోషకాహార విలువలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. యానాంలోనూ అక్షయపాత్రను అమలు చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్అశోక్ ఇటీవలి అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రి నమశ్శివాయంను కోరారు. ఈ నేపథ్యంలో మూడు స్కూళ్లలో పైలెట్ ప్రాజెక్టు అనంతరం ఫీడ్‌బ్యాక్ ఆధారంగా మిగిలిన పాఠశాలల్లో అమలు చేస్తారని చెబుతున్నారు.



గిరియాంపేట స్కూల్లో అక్షయపాత్ర ఫౌండేషన్ అందించిన భోజనం చేస్తున్న విద్యార్థులు

ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

యానాం: యానాం బైపాస్ రహదారిలో కొలువైన కార్యసిద్ధి అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళశారం ఆలయ అర్చకులు వెంకటరామసుబ్రహ్మణ్యం శర్మ పర్యవేక్షణలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాళ్ల ప్రసాద్, మాధవరపు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. 108 లీటర్ల ఆవు పాలతో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగుల డీఏపై జీవో విడుదల

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు మంగళవారం ఆర్థికశాఖ డీఏకు సంబంధించి జీవో ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్ శివకుమార్ విడుదల చేసారు. డీఏ చెల్లింపు, సవరించిన రేటును ఈ ఏడాది జనవరి 1, నుంచి అమలు చేస్తామన్నారు. దీనిపై యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లలో అన్ని విభాగాల అధిపతులకు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్ అండ్ ట్రెజరీలకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుల బైండోవర్

అల్లవరం: అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికారికంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న అల్లవరం మండలానికి చెందిన ముగ్గురిని బైండోవర్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. మండలంలో గూడాల గ్రామానికి చెందిన బొంతు వెంకటరెడ్డి, కొమ్ముల వీరబాబు, అద్దంకి సతీష్ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీరిని అల్లవరం తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు ముందు హాజరుపరచగా సెక్షన్ 129 బీఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం బైండోవర్ కేసులు నమోదు చేసి రూ. లక్ష పూచీకత్తుపై విడుదల చేశారని తెలిపారు.

మూల్యాంకన సిబ్బంది దాహార్తి తీర్చిన ఎస్టీయూ



ఉపాధ్యాయులకు కూల్ డ్రింక్స్ పంపిణీ చేస్తున్న డీఈవో బాషా, ఎస్టీయూ నేతలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాలో ఇటీవల నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనంలో విధులు నిర్వహిస్తున్న 1,500 మంది ఉపాధ్యాయులకు జిల్లా ఎస్టీయూ శాఖ సభ్యులు కూల్ డ్రింక్స్‌ను మంగళవారం మధ్యాహ్నం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాన్ని డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా ప్రారంభించారు. ఎస్టీయూ సేవలు అభినందనీయమని డీఈవో అన్నారు. ఎస్టీయూ ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్న వారికి స్వయంగా కూల్‌డ్రింక్స్ అందజేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుడు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్య పల్లంరాజు, జిల్లా ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర కన్వీనర్ బోణం గంగాధర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నల్లా రామకృష్ణ పాల్గొన్నారు.

గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలి

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం అక్రమంగా, అన్యాయంగా పెంచిన పెట్రో ధరలు తగ్గించాలని సీపీఎం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. స్థానిక గొల్లగూడెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై ఒక్కసారిగా రూ.50 ధర పెంచి గృహ వినియోగదారులు ముఖ్యంగా మహిళలపై మరింత ఆర్థిక భారాన్ని మోపిందని వెంకటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. విపరీతంగా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వం నియంత్రించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు శివ శంకర్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

యానాం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తుల ధరలు సామాన్యుడికి భారంగా మారాయని, తక్షణం పెంచిన ధనలను ఉపసంహరించుకోవాలని మంగళవారం సీపీఎం యానాం శాఖ కార్యదర్శి జి దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తులను పెంచడం దారుణమన్నారు.

చిత్రకళలో విద్యార్థుల ప్రతిభ



చిత్రకళా పోటీల్లో బహుమతులు పొందిన చిన్నారులు

యానాం: కోనసీమ చిత్ర కళాపరిషత్ సంస్థ 35వ చిత్రకళా ఉత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన చిత్రకళా పోటీల్లో స్థానిక రీజెన్సీ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చారని మంగళవారం హెచ్ఎం టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా 25 మంది గోల్డ్ మెడల్స్, బాలమిత్ర అవార్డులు, ప్రశంసాపత్రాలను పొందారన్నారు. చిత్రకళలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న డ్రాయింగ్ టీచర్ పెన్మెత్స ప్రశాంతికి విశిష్ట ఆచార్య పురస్కార్ అవార్డును అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయుడు సీహెచ్ వీరభద్రరావు అభినందించారు.

వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు ఓ భక్తుడు విరాళం అందించారు. మురమళ్లకు చెందిన దండుమేను వెంకటేశ్వరరావు దంపతులు రూ.10,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షణ అధికారికి శ్రీనివాసరాజుకు అందించారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు.

13న మెగా రక్తదాన శిబిరం

యానాం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 13 ఆదివారం స్థానిక గోపాల్‌నగర్‌లో అంబేడ్కర్ విజ్ఞానభవన్‌లో ఉదయం 9 గంటలకు మెగారక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మంగళవారం నిర్వాహకులు నబ్బుతి లోకేశ్వరరావు, కనకాల రాజు, ముదే హరిశ్చంద్ర తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ కె రామకృష్ణ పాల్గొంటారని తెలిపారు. ప్రమాదాలకు గురవుతున్న క్షతగాత్రులకు రక్తం అందక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని, రక్తదానం చేయడానికి ఆసక్తిగల యువకులు 7093944488, 9848206665 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పీచు పరిశ్రమకు దారి మూసివేతపై ఫిర్యాదు

అమలాపురం రూరల్: మామిడికుదురు మండలం పెదపట్నంలంకలో సాయిలక్ష్మి కాయర్ ఇండస్ట్రీ అనే చిన్నతరహా పీచు పరిశ్రమకు వెళ్లే దారిని కొంతమంది వ్యక్తులు సర్పంచ్ సుందరనీడి రాజేష్‌కుమార్ ప్రోద్బలంతో తవ్వి అడ్డుకున్న వారిపై దాడి చేశారని బాధితురాలు వేగి వెంకటసత్యవతి కలెక్టర్, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. దారిలేక పీచు పరిశ్రమను ఆగిపోవడంతో 30 మంది ఉపాధి కోల్పోయారని ఆమె పేర్కొన్నారు. రోడ్డును ధ్వంసం చేస్తున్న సమయంలో 100 నంబరుకు ఫోన్ చేసినా, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని బాధితురాలు తెలిపారు. ఒక మహిళ ఆధ్వర్యంలో నడుస్తున్న పరిశ్రమ మూసి వేతకు కారణమైన సర్పంచ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.